

.. ఈ ఫొటోలో కనిపిస్తున్నది పెద్దపల్లి మండలం భోజన్నపేట, కొత్తపల్లి గ్రామాల మధ్య హుస్సేన్‌మియా వాగుపై చెక్‌డ్యాం. ఇది మూలసాల గ్రామ సమీపంలో ఉంటుంది. అయితే, 2024 జనవరి 15న జిలెటిన్ స్టిక్స్ పెట్టి ఈ చెక్‌డ్యాంను పేల్చి వేసేందుకు కొంత మంది ప్రయత్నించారు. కంప్రెషర్‌తో డ్రిల్లింగ్ చేస్తున్న శబ్ధం రావడం, సమీపంలోని రైతులు వచ్చి చూడడంతో జిలెటిన్ స్టిక్స్, డ్రిల్లింగ్ యంత్రాన్ని అక్కడే వదిలేసి ట్రాక్టర్‌తో సహా పారిపోయారు. అయితే, ఇన్ని రోజులు గడుస్తున్నా చెక్‌డ్యాం కూల్చేందుకు ఎవరు యత్నించారు..? అనేది మిస్టరీగానే మిగిలింది. ఈ విషయంలో ఇరిగేషన్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయలేదు.

# నో బిల్.. నో రిసిప్ట్

- పెద్దపల్లి జిల్లాలో జోరుగా పేలుడు పదార్థాల విక్రయాల దందా
- రాత్రి వేళల్లో బైకులపై రవాణా
- కాలపరిమితి ముగిసిన కంకర క్వారీలకు సరఫరా
- అసాంఘిక శక్తులకు చేరుతున్నట్లూ ప్రచారం
- పట్టించుకోని పోలీసులు, మైనింగ్ శాఖల అధికారులు



పేలుడు పదార్థాలతో తొలిచిన బొంపల్లి గుట్ట

**కొండలు, పెద్ద పెద్ద బండలను పిండిగా మార్చే ప్రమాదకర పేలుడు పదార్థాల దందా పెద్దపల్లి జిల్లాలో జోరుగా సాగుతున్నది. సంబంధిత శాఖల నిర్లక్ష్యం.. పట్టింపులేమితో అక్రమ వ్యాపారం మూడు పూలు, ఆరు కాయలుగా విస్తరిస్తున్నది. అనుమతుల పేరిట జిలెటిన్ స్టిక్స్, డీ గార్డ్(బత్తులు), డిటోనేటర్లను ఎవరికి పడితేవారికి డబ్బులు ఎక్కువిస్తే చాలు 'నో బిల్.. నో రిసిస్ట్' అన్నట్లుగా నడుస్తున్నది. రాత్రి వేళల్లో బైకులపై రవాణా చేయడం, కాలపరిమితి ముగిసిన కంకర క్వారీలకు సరఫరా చేస్తుండగా, ఇదే సమయంలో అసాంఘిక శక్తుల చేతుల్లోకి సైతం వెళ్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది.**



బొంపల్లిలో కొనుగోలు చేసిన జిలెటిన్ స్టిక్స్

పెద్దపల్లి, మార్చి 15(నమస్తే తెలంగాణ): జిల్లాలో ప్రమాదకర పేలుడు పదార్థాలు జిలెటిన్ స్టిక్స్, డీ గార్డ్(బత్తులు), డిటోనేటర్ల విక్రయాల అక్రమ దందా విచ్చలవిడిగా జరుగుతున్నది. జిల్లాలో 150వరకు క్వారీలు ఉన్నాయి. ఇందులో అఫీషియల్‌గా 16వరకు అనుమతులతో నడుస్తున్నాయి. పలు రకాల కారణాలతో మిగతావాటి అనుమతులను నిలిపివేశారు. అయినప్పటికీ క్వారీల్లో ఎక్స్‌ప్లోజివ్ పేల్చివేతల కోసం పెద్ద ఎత్తున పేలుడు పదార్థాలను వినియోగిస్తున్నారు. జిల్లాలో రెండు సంస్థలకు మాత్రమే పేలుడు ఎక్స్‌ప్లోజివ్ లైసెన్స్ ఉన్నది. పెద్దపల్లి మండలం బొంపల్లిలో ఒక ఫర్మ్ పేరుతో పెద్ద ఎత్తున విక్రయాలు సాగుతుండగా, జూలపల్లి మండలంలోని మరో ఫర్మ్ పేరుతో ఎక్స్‌ప్లోజివ్ లైసెన్స్‌లను కలిగి ఉన్నారు. వీరు ఎక్స్‌ప్లోజివ్ లైసెన్స్ ఉన్నవారికి, అది కూడా పగటిపూట మాత్రమే సరఫరా చేయాలి. పోలీస్ శాఖ నుంచి బ్లాస్టింగ్ అనుమతులు ఉన్న క్వారీలకు మాత్రమే సప్లయి చేయాలి. ఇలా సవాలక్ష నిబంధనలు ఉన్నా పట్టించుకునేవారు లేక ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ అనుమతి లేకుండా సీజ్ చేసిన, కాలపరిమితి ముగిసిన కంకర క్వారీలకు విక్రయాలు చేస్తున్నట్లు తెలుస్తున్నది. అంతేకాదు క్వారీలు, బావుల తవ్వకానికి మాత్రమే ఉపయోగించే వాటిని బయటి వ్యక్తులకు విక్రయిస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది. ఎవరు వచ్చి అడిగినా, వీరు చెప్పే ధర చెల్లిస్తే చాలు విక్రయించే విధానం కొనసాగుతున్నది. దీంతో ఇవి అసాంఘిక శక్తులకు సైతం చేరుతున్నాయనే ప్రచారం సాగుతున్నది. విక్రయ కేంద్రాల వద్ద కనీసం రికార్డులను సైతం మెయింటేయిన్ చేయడం లేదని, 'నో బిల్.. నో రిసిప్ట్' అన్న చందంగా జోరుగా పేలుడు పదార్థాలను విక్రయిస్తున్నారే విమర్శలు వినిపిస్తున్నాయి. కంప్లీట్ జీరో దందాగా సాగుతున్న ఈ వ్యాపారాన్ని పోలీసులు కట్టడి చేయాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

### నిబంధనలకు నీళ్లు..

పేలుడు పదార్థాలను విక్రయించాలన్నా, వినియోగించాలన్నా ఇటు పోలీస్ శాఖ నుంచి, అటు మైనింగ్ శాఖ నుంచి పూర్తిగా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. విక్రయదారుడు ఎక్స్‌ప్లోజివ్ లైసెన్స్ కలిగి ఉండడంతో పాటు వాటిని షార్ట్ ఫైర్ లైసెన్స్ కలిగిన వారికి ప్రత్యేకమైన ఎక్స్‌ప్లోజివ్ ప్రొటెక్షన్ సెక్యూర్ వాహనంలో వాటిని తరలించాల్సి ఉంటుంది. క్వారీల్లో షార్ట్‌ఫైర్ లైసెన్స్ కలిగిన వారు మాత్రమే ఈ పేలుడు పదార్థాలను పేల్చాల్సి ఉంటుంది. ఆ సమయంలో అనేకమైన రక్షణ చర్యలను తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ విక్రయాల్లో కానీ, కొనుగోళ్లలో కానీ, రవాణాలో కానీ, వినియోగంలో కానీ పూర్తిగా నిబంధనలకు నీళ్లు వదిలారు. పేలుడు పదార్థాలను రాత్రివేళ బొంపల్లి నుంచి బైక్‌లపై నేరుగా క్వారీలకు తరలిస్తున్నారని ప్రచారం జరుగుతున్నది. పర్యవేక్షించాల్సిన పోలీస్, మైనింగ్ శాఖలు పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి.



బొంపల్లి గుట్టపై గల పేలుడు పదార్థాల విక్రయ కేంద్రం



విక్రయ కేంద్రం వద్ద గల పేలుడు పదార్థాల కాటన్లు

### పోలీసుల ఉదాసీనత..

జిల్లాకు సంబంధించి ఏడాది క్రితమే రెండు ఘటనలు చోటు చేసుకున్నాయి. ఒకటి ప్రభుత్వ ఆస్తి అయిన హుస్సేన్‌మియా వాగుపై నిర్మించిన చెక్‌డ్యాం పేల్చివేతకు కుట్ర, మరో ఘటనలో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మావోయిస్టులకు పేలుడు పదార్థాలు సరఫరా చేస్తున్న పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం బామ్లానాయక్ తండాకు చెందిన కొంత మందిని పోలీసులు అరెస్టు చేయడం. ఈ రెండు ఘటనల్లో మందు పాతరలు పట్టుబడ్డా, పెద్దపల్లితో సంబంధం ఉన్నా, అసలు అవి ఎక్కడి నుంచి వచ్చాయి..? ఎలా వచ్చాయి. ఎవరు ఇచ్చారు..? అనే కోణంలో విచారించకపోవడం, కేసులు కూడా నమోదు చేయకపోవడంలోనే పోలీసుల ఉదాసీనత కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. ఈ విషయంపై జిల్లా మైనింగ్ అధికారి ఏ శ్రీనివాస్‌ను వివరణ కోరగా, ఇది తన పరిధిలోకి రాదని, పోలీసుల పరిధిలోకే వస్తుందని తెలిపారు. బసంత్‌నగర్ ఎస్ఐని వివరణ కోరగా రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలోని ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఉంటుందని తెలిపారు.

## పసుపు రైతులకు మద్దతుగా ఎమ్మెల్సీ కవిత

'జై జవాన్.. జై కిసాన్' అంటూ ప్లకార్డులు




ప్లకార్డుతో ఎమ్మెల్సీ కవిత

జగిత్యాల, మార్చి 15 : పసుపు రైతులకు నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మద్దతుగా నిలిచారు. పసుపు పంట క్వింటాల్‌కు రూ.15 వేల గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ 'జై జవాన్, జై కిసాన్' అని రాసి ఉన్న ప్లకార్డులను శాసన మండలి ఆవరణలో పట్టుకుని గొంతెత్తారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా రైతులకు గిట్టుబాటు ధరలు రావడం లేదని, యాసంగి పంటలకు సాగునీరు లేక రైతులు మొత్తుకుంటున్నారని, అయినా రేవంత్ రెడ్డి సర్కార్‌కు చీమ కుట్టినట్టు లేదని మండిపడ్డారు. జగిత్యాల జిల్లాలో పసుపు రైతుకు గిట్టుబాటు ధరలు రావడం లేదని, గిట్టుబాటు ధరల కోసం పసుపు రైతులు మెట్‌పల్లిలో రోడ్డెక్కారని గుర్తు చేశారు.

## సీఎంఆర్ఎఫ్‌లో రూ.50 లక్షల కుంభకోణం!

- వెంటనే ఏసీబీతో విచారణ జరిపించాలి
- మానకొండూర్ నియోజకవర్గంలో కొందరు నాయకులు అక్రమాలు చేస్తున్నరు
- ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ కనుసన్నల్లోనే చెక్కులు పక్కదారి
- జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు ఆరోపణలు



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు

ఇల్లంతకుంట, మార్చి 15: మానకొండూర్ నియోజకవర్గంలో సీఎంఆర్ఎఫ్ విషయంలో దాదాపు రూ.50 లక్షల కుంభకోణం జరిగినట్లు సమాచారం ఉందని, దీనిపై ఏసీబీ విచారణ జరిపించి ఎమ్మెల్యే తన విశ్వసనీయతను నిరూపించుకోవాలని జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు డిమాండ్ చేశారు. ఇల్లంతకుంట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో కొందరు కాంగ్రెస్ నాయకులు సీఎంఆర్ఎఫ్‌ల విషయంలో చీకటి దందా చేస్తున్నారని, రాబంధులుగా మారి బాధితులకు చెక్కులు అందకుండా మింగేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం కనుసన్నల్లో సీఎంఆర్ఎఫ్ సాయంలో అక్రమాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. మూడు రోజుల క్రితం రహీంఖాన్ పేటలో కే రవి పేరుమీద పక్కదారి పట్టగా, ఇందుకు కాంగ్రెస్ బాధ్యత వహిస్తు గ్రామానికి చెందిన ఓ కార్యకర్తను నుంచి బహిష్కరించి చేతులు దులుపుకొన్నదని దుయ్యబట్టారు. తాజాగా వల్లంపట్ల గ్రామానికి చెందిన ఎల్ శ్రీనివాస్ పేరున వచ్చిన రూ.26 వేల చెక్కును మరో గ్రామానికి చెందిన ఎల్ శ్రీనివాస్ పేరున ఖాతాలో జమ చేయించి, ఓ నాయకుడు ఫోన్ పే చేయించుకున్నాడని ఆరోపించారు. ఈ చీకటి దందా వెనుక ఎమ్మెల్యే హస్తం ఉందని, అందుకే ఎవరూ నోరు మెదపడం లేదన్నారు. అసలు దొంగలను కాపాడుతూ గ్రామ స్థాయిలో ఉన్న చిన్న కార్యకర్తలను బాధ్యుల్ని చేయడం చూస్తుంటే ఇందులో ఎమ్మెల్యే హస్తం లేదా..? అని ప్రశ్నించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు బొల్లం వెంకన్న, సాదుల్, కొట్టె వెంకన్న, ఒల్లాల రవి, కూనబోయిన రఘు, దయ్యాల మహేశ్, కూస నరేశ్, సదువాల పరుశరాం, సతీష్, రాములు, మొండయ్య ఉన్నారు.

## వచ్చే నెల 20 నుంచి ఓపెన్ పరీక్షలు

కమాన్‌చౌరస్తా, మార్చి 15 : ఓపెన్ ఎస్ఎస్‌సీ, ఇంటర్ పరీక్షలు వచ్చే నెల 20వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని కరీంనగర్ జిల్లా విద్యాధికారి సీహెచ్ వీఎస్ జనార్ధన్ రావు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ చలువాజి నాగేశ్వర రావు ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5గంటల వరకు పరీక్షలు ఉంటాయని చెప్పారు. ఈ విద్యాసంవత్సరంలో పదో తరగతి, ఇంటర్ అడ్మిషన్లు పొందిన, రెగ్యులర్, సప్లిమెంటరీ అభ్యర్థులు, పరీక్షల రుసుంను అధ్యయన కేంద్రాలలో చెల్లించి, హాల్ టికెట్లు తీసుకోవాలని సూచించారు.

# గాంధీనగర్ ప్రజల గోస తీరింది

- సర్వే నంబర్ 909లో భూములు, ఇండ్లు అమ్మలేక, కొనలేక 17 ఏండ్లుగా నరకం
- తాజాగా క్రయ విక్రయాలకు అనుమతులు
- కాలనీవాసుల్లో ఆనందం



గాంధీనగర్

పెద్దపల్లి, మార్చి 15(నమస్తే తెలంగాణ): సుల్తానాబాద్ పట్టణంలోని గాంధీనగర్ వాసుల గోస తీరింది. సర్వే నంబర్ 909లో క్రయ విక్రయాలకు అనుమతి వచ్చింది. 2007లో సుల్తానాబాద్‌లో పనిచేసిన ఓ తహసీల్దార్ చేసిన తప్పిదంతో ఇక్కడి ఇండ్లు జాగలన్నీ ప్రొహిబిషన్ లిస్టులోకి చేరిపోయాయి. అత్యవసర సమయాల్లో తమ ప్రాపర్టీ అమ్ముకోలేక, కొనుక్కోలేక దాదాపు 280కుటుంబాలు 17ఏండ్లుగా అరిగోస పడ్డాయి. ఈ క్రమంలో ప్రజల కష్టాలను గుర్తు చేస్తూ గతేడాది జూలై 4న 'నమస్తే తెలంగాణ'లో 'అమ్మరాదు.. కొనరాదు' అంటూ ప్రత్యేక కథనాన్ని ప్రచురితం చేసింది. ప్రజలు సైతం ప్రజావాణిలో దరఖాస్తు చేస్తూ వస్తున్నారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రత్యేక చొరవ చూపి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. జరిగిన తప్పిదాన్ని ఉన్నతాధికారులతో చర్చించి వారికి అనుకూలంగా భూములు, ఇండ్లు అమ్ముకునేలా, కొనుక్కునే విధంగా హక్కులను కల్పించగా, కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

### క్రయ విక్రయాలకు అనుమతి.. కలెక్టర్ కోయ శ్రీహర్ష

సుల్తానాబాద్ పట్టణంలోని గాంధీనగర్‌లోని 10వ వార్డు సర్వే నంబర్ 909లో భూములు, ఇండ్ల రిజిస్ట్రేషన్లకు అనుమతి లభించిందని కలెక్టర్ కోయ శ్రీహర్ష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వే నంబర్ 909లో మొత్తం 15.19ఎకరాల భూమి ఉందని, వీటిలో 1.13ఎకరాల భూమి మాత్రమే రోడ్ల కింద ఉందని, మిగిలింది పట్టా భూమి అని తెలిపారు. సర్వే నంబర్ 909/1, 909/2, 909/అ కింద ఉన్న భూమి పట్టా భూమి అని ధ్రువీకరించామని, దీనిపై ఐజీ, డీఐజీలను సంప్రదించామని, ఇక నుంచి రిజిస్ట్రేషన్లు చేయవచ్చునని తెలిపారు. అయితే మెయిన్ సర్వే నంబర్ 909లో రోడ్డు కింద ఉన్న 1.13ఎకరాలు రిజిస్ట్రేషన్ చేయడానికి వీలు లేదని కలెక్టర్ పేర్కొన్నారు.



గోదావరిఖని వన్‌టౌన్ సీఐకి ఫిర్యాదును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

## సభ్యసమాజం సిగ్గుపడేలా సీఎం వ్యాఖ్యలు

చర్యలు తీసుకోవాలని 'ఖని' వన్‌టౌన్‌లో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి ఫిర్యాదు

గోదావరిఖని, మార్చి 15: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి సభ్యసమాజం సిగ్గుపడేలా వ్యాఖ్యలు చేశారని, ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలిటికల్ మెచ్యూరిటీ లేకనే అనుచిత వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. సీఎంపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలను తెలంగాణ సమాజం క్షమించదని హెచ్చరించారు. రక్తపు చుక్కలు నేల రాలకుండా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన వాళ్లమని గుర్తు చేశారు.

# తలాపునే జలాశయం పొలాలకు తడేది..?

- కోనరావుపేటలో సాగునీటి గోస
- మల్కపేట రిజర్వాయర్ ఉన్నా ప్రయోజనం శూన్యం
- కుడి కాలువను అసంపూర్తిగా వదిలేయడంతో చుక్కనీరు వాడుకోలేని దుస్థితి
- పట్టని ప్రభుత్వం
- అడుగంటుతున్న భూగర్భజలాలు
- ఎండుతున్న యాసంగి పంటలు
- కాపాడుకునేందుకు రైతుల భగీరథ యత్నాలు
- ఎన్నిబోర్లు వేసినా దొరకని నీటి జాడ
- పలుచోట్ల ట్యాంకర్ల ద్వారా తడి



పొట్ట దశకు వచ్చిన వరి పొలానికి ట్యాంకర్ ద్వారా నీరందిస్తున్న రైతు

కోనరావుపేట, మార్చి 15 : కోనరావుపేట మండలం తల్లడిల్లుతున్నది. తలాపునే జల బాంఢాగారం మల్కపేట రిజర్వాయర్ ఉన్నా చుక్కనీరు వాడుకోలేని దుస్థితిలో మగ్గుతున్నది. సాగును బంగారం చేయడమే లక్ష్యంగా గత బీఆర్ఎస్ సర్కారు జలాశయాన్ని నిర్మించింది. ఎడమ కాలువను పూర్తి చేసింది. కుడి కాలువ పనులు చివరి దశకు తీసుకురావడం, అంతలోనే ప్రభుత్వం మారింది. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ సర్కారు పట్టించుకోకపోవడం, తట్టెడు మట్టికూడా తీయకపోవడంతో అసంపూర్తిగానే మిగిలిపోవడంతో పల్లెల్లో సాగునీటి కటకట తీవ్రమైంది. నిజామాబాద్, ధర్మారం, సుద్దాల, పల్లిమక్త, నాగారం, మామిడిపల్లి గ్రామాల్లో పంట ఎండుతున్నది. భూగర్భజలాలు పడిపోయి బోర్లు, బావులు ఇంకిపోగా, రైతులు ఆగమవుతున్నారు. పంటను కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. పలువురు రైతులు లక్షలకు లక్షలు అప్పులు చేసి బోర్లు వేయిస్తున్నా చుక్క నీరు రాకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. పలువురు డబ్బులు చెల్లిస్తూ ట్యాంకర్ల ద్వారా నీరందించుకుంటున్నారు. కొన్ని చోట్ల పంటపై ఆశలు వదిలేశారు. చేసేదేం లేక పశువులకు మేతగా వదిలేస్తున్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు రైతులు కోరుతున్నారు.



నిజామాబాద్ గ్రామంలో పొట్ట దశకు వచ్చిన వరిపంటలో మేస్తున్న బర్రెలు



ఎండిపోతున్న పంట పొలాన్ని చూపిస్తున్న రైతు మోహిన్‌రెడ్డి

### కేసీఆర్ చేసిన పనులే.. కొత్తవి చేయలే..

మాది నిజామాబాద్ ఊరు. తలెత్తి చూస్తే కేసీఆర్ నిర్మించిన మల్కపేట రిజర్వాయర్ కనవడుతది. ఇక నా పంట పక్క నుంచే నీరు పోయేందుకు ప్రధాన కాలువ తీసిండ్రు. కేసీఆర్ చేసిన పనులు తప్ప ఇప్పటివరకు మల్లా కొత్త పనులు చేయలే. కాలువ పాడువడి పోయింది. తుమ్మలు మొలిచినయి. కాలువ పూర్తయితే మాకు మస్తు నీళ్లస్తుండే. ఈ బాధ ఉండకపోవు. నాకు ఊళ్లే ఐదెకరాల భూమి ఉంది. సాగు నీటి మీద ఆశ లేక రెండెకరాలే సాగు చేసిన. నాలుగు బోర్లు వేసినా లాభం లేదు. కొన్నే నీళ్లు వస్తున్నయి. ఎకరం కూడా పారుతలేదు. పెట్టుబడి రూ.50వేలైంది. పంట పండుతదో లేదో.. తెలువది గానీ ఎండిపోవద్దని రోజుకు రూ.4వేలు పెట్టి నాలుగు వాటర్ ట్యాంకర్లతో పారిస్తున్నా. మాలాంటి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలె. కెనాల్‌ను పూర్తి చేయాలి.

**- కొండం మోహిన్‌రెడ్డి, రైతు, నిజామాబాద్(కోనరావుపేట)**



నెర్రెలు బారిన బారిన పంట పొలాన్ని చూపిస్తున్న రైతు పరశురాములు

### నీళ్లు పారక పశువులను మేపుతున్న..

నాకు నిజామాబాద్‌లో రెండున్నరెకరాల భూమి ఉన్నది. మరో ఎకరంనర కౌలుకు తీసుకుని వరి వేసిన. మల్కపేట రిజర్వాయర్‌తో మా ఊళ్లే బోర్లు, బావుల్ల నీళ్లుంటయని అనుకున్న. కానీ కాంగ్రెస్ సర్కారు రిజర్వాయర్ల నీళ్లు పూర్తిగా నింపలే. కుడి కాలువను పూర్తిచేయలే. భూ గర్భ జలాలు పడిపోయినయి. నీరందక చేతికందివచ్చిన పంటలు ఎండిపోతున్నయి. చేసేదేమిలేక పశువులను మేపుతున్నాం. ప్రభుత్వం మాలాంటి చిన్న సన్నకారు రైతులను ఆదుకోవాలి.

**-గురుక పరశురాములు, యువరైతు, నిజామాబాద్(కోనరావుపేట)**

### పొట్టదశలో ఎండిపోతంది..



నాకు ఊళ్లే రెండెకరాల భూమి ఉంది. వరి వేసిన. మొదటగా ఎదుగుదలతో మంచిగానే ఉన్నా, పొట్ట దశకు వచ్చే సరికి నీళ్లు ఎల్లక ఎండిపోతంది. పొలం నెర్రెలు బారుతుంది. కనీసం పెట్టుబడి పైసలు వచ్చుడు కూడా గగనమైంది. పశువులకు మేతకు పెట్టుడు తప్ప మరో దారి లేదు.

**- జంగిలి కిషన్, రైతు, నిజామాబాద్(కోనరావుపేట)**